# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 7, జులై 2026


ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ

# వెంటనే పూర్తి చేయాలి

- జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్ష
- నిర్మల్ జిల్లాలో పంపిణీ పూర్తయింది: కలెక్టర్ భవేశ్ మిశ్రా





**నిర్మల్, జులై 06, ప్రభాతవార్త:**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ, డిజిటలైజేషన్‌పై సోమవారం సాయంత్రం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ.. జిల్లాల వారీగా ఇప్పటివరకు జరిగిన ఫాంల పంపిణీ ప్రగతిని సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ఫాంలను అందజేయాలని స్పష్టం చేశారు. బీఎల్ఓలు మాత్రమే ఈ ఫాంలను పంపిణీ చేయాలని, బీఎల్ఏలకు గానీ, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులకు గానీ ఫాంలు పంపిణీ చేసే అధికారం లేదని తేల్చి చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి అవసరమైన చోట అదనపు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు మిగతా 2లో..

# ఎస్ఆర్‌పీ 3 గనిలో మరో ప్రమాదం..

- ట్రామర్ పోశమల్లుకు గాయాలు
- వరుస ఘటనలతో గని కార్మికుల్లో నెలకొన్న ఆందోళన



**నస్పూర్, జూలై 6, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఎస్ఆర్‌పీ 3 భూగర్భ గనిలో సోమవారం మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మొదటి షిఫ్ట్‌లో ట్రామర్‌గా విధులు నిర్వహిస్తున్న చుంచుల పోశమల్లు అనే కార్మికుడు గాయపడ్డారు. ఉదయం 11 గంటల సమయంలో గనిలోని 3ఏ సీమ్, 3వ లెవెల్ వద్ద ఖాళీ టబ్బులను తీసుకువెళుతున్న క్రమంలో అకస్మాత్తుగా రాడ్ కుక్క జారిపోయి బలంగా తాకడంతో పోశమల్లు కుడికాలు మోకాలు కింది భాగంలో విరిగింది. గాయపడిన కార్మికుడిని తోటి సిబ్బంది వెంటనే రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కాగా, ఎస్ఆర్‌పీ 3 గనిలో వరుసగా ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం గనుల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు, కార్మికులు కోరుతున్నారు.

# కోటపల్లి కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యం..!

- పాఠశాల యాజమాన్యం సమాచారంతో తల్లిదండ్రుల ఫిర్యాదు..
- కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు!

**కోటపల్లి జూలై 6 ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. ఇక్కడ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి శృతి (17) అనే విద్యార్థిని అదృశ్యమైంది. స్థానిక వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నుంచి సాయి శృతి హాస్టల్‌లో కనిపించకుండా పోయింది. విద్యార్థిని కోసం ప్రాంగణమంతా వెతికిన పాఠశాల యాజమాన్యం, ఆమె ఆచూకీ లభించకపోవడంతో వెంటనే విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు చేరవేశారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై పాఠశాల వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థిని ఆచూకీని త్వరగా కనుగొనేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కేజీబీవీ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. బాలిక అదృశ్యం వెనుక గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.







### ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ

# వెంటనే పూర్తి చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

చేయాలన్నారు. వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఈ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తామని తెలిపారు. ఫాంల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రక్రియపై జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ వివరాలను వెల్లడిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన పంచాయతీ కార్యదర్శిని సన్మానించిన సర్పంచ్

### - అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

### - పంచాయతీ కార్యదర్శి శ్రావణి

**సారంగాపూర్, జులై 06, ప్రభాతవార్త:**

మండలంలోని సాయినగర్ తండాకు నూతనంగా బదిలీపై వచ్చి పదవీ బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి శ్రావణిని గ్రామ సర్పంచ్ సబ్లె సరిత గోపాల్ సింగ్ ఘనంగా సన్మానించారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి విధుల్లోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పంచాయతీ కార్యదర్శి శ్రావణి మాట్లాడుతూ.. తనకు ఘన స్వాగతం పలికిన సర్పంచ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల సహాయ సహకారాలతో సాయినగర్ తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామ ప్రగతి పనులు ప్రజలందరికీ సకాలంలో అందేలా బాధ్యతాయుతంగా విధి నిర్వహణ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్లె నానక్ సింగ్, దేవి సింగ్, బాబూలాల్, ప్రకాష్, బాబురావు, రవీందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీలో పనుల పరిశీలన

**చింతలమానేపల్లి, జులై 6, ప్రభాతవార్త:**

మండలంలోని బాబాసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మేఘా నర్సరీని సోమవారం ఎంపీడీఓ సత్యనారాయణ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బాబాసాగర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి డి.సత్తెమ్మ, ఏపీఓ (ఈజీఎస్) శ్రీ షోయబ్‌తో కలిసి నర్సరీలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. నర్సరీలో మొక్కల షిఫ్టింగ్, గ్రేడింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఎంపీడీఓ ఆదేశాలు జారీ చేశారు. మొక్కల సంరక్షణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్దేశిత గడువులోపు అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

# భైంసా కేజీబీవీలో అవినీతిపై దర్యాప్తు జరిపించాలి

### ఎస్ఓను వెంటనే విధుల నుంచి తొలగించాలి: పీడీఎస్‌యూ డిమాండ్

### సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పణ

**భైంసా, జులై 06, ప్రభాతవార్త:**



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్, సంఘం నాయకులు

భైంసా పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఆమెను వెంటనే విధుల నుండి తొలగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ.. భైంసా కేజీబీవీలో ఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న జ్యోతి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. విద్యార్థుల డైట్ బిల్లులతో పాటు పాఠశాలకు సంబంధించిన ఇతర వస్తువుల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగాయని, కేజీబీవీ నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. విద్యార్థులకు నాసిరకం కూరగాయలు, సరుకులతో భోజనం పెడుతూ నిధులు కాజేస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమాలను ప్రశ్నించిన సిబ్బందిపై ఆమె కక్షపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నారని, తనకు సహకరించే వారికే మద్దతు ఇస్తూ మిగతా వారిని చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలలోని నాన్ టీచింగ్ స్టాఫ్‌ను తన చెప్పుచేతల్లో పెట్టుకుని, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గత రెండేళ్లుగా పాఠశాలలో జరిగిన డైట్ చెల్లింపులు, ఆదాయ వ్యయాలపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. తప్పు రుజువైతే ఆమె నుండి నిధులను రికవరీ చేసి, తక్షణమే విధులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గంగప్రసాద్, తరుణ్, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

# పవర్‌గూడలో వివో భవన నిర్మాణానికి భూమి పూజ

### రూ.10 లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణం - భవన నిర్మాణాన్ని నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలి : సర్పంచ్ తొడసం రాజేందర్

**జైనూర్, జులై 06, ప్రభాతవార్త:**



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ తొడసం రాజేందర్, చిత్రంలో ఉపసర్పంచ్ డోంగ్రే ప్రకాష్, సంఘం మహిళలు

పవర్‌గూడ పంచాయతీ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు గ్రామాభివృద్ధికి మరింత ఊతమివ్వాలనే లక్ష్యంతో నూతన వివో (గ్రామ సంఘం) భవన నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తొడసం రాజేందర్ తెలిపారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పవర్‌గూడలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వివో భవన నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నూతన భవన నిర్మాణ పనులను ఎలాంటి రాజీ లేకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా వివో సంఘం మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ భవన అందుబాటులోకి వస్తే పొదుపు సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, వారి కార్యకలాపాలు సాగించడానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి, ప్రగతి పనులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ డోంగ్రే ప్రకాష్, వివో సంఘం ప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: డాక్టర్ నరేందర్ రాథోడ్

### ఈ నెల 13న జిల్లావ్యాప్తంగా 1.58 లక్షల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**నస్పూర్, జులై 6, ప్రభాతవార్త**



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీన జిల్లాలోని ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను, కరపత్రికలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 930 అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నమోదైన విద్యార్థులందరికీ ఆశా కార్యకర్తల ద్వారా ఈ మాత్రలను తినిపించనున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,58,480 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, విద్యాశాఖ, ఐసీడీఎస్ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నులిపురుగుల కారణంగా పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడుతూ శారీరక, మానసిక పెరుగుదలలో మందకొడిగా మారుతారని డాక్టర్ నరేందర్ రాథోడ్ వివరించారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు సగం టాబ్లెట్ పొడి చేసి తాగించాలని, 3 నుండి 19 సంవత్సరాల పిల్లలందరికీ ఒక ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను చప్పరించి తినిపించాలని సూచించారు. ఈ మాత్రలు పూర్తిగా సురక్షితమైనవని, వీటిని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోనే అధికారుల సమక్షంలో తినిపించాలని, ఇంటికి ఇవ్వరాదని స్పష్టం చేశారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం లాంటి వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ భీష్మ, ప్రోగ్రాం అధికారులు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, రషీద్, ఆర్ఎస్ పద్మ, డిపిఓ ప్రశాంతి, సుమన్, సురేందర్, ఆర్‌బిఎస్‌కే వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## జామ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విరాసత్ వర్క్‌షాప్ డెమోన్స్ట్రేషన్

**సారంగాపూర్, జులై 06, ప్రభాతవార్త:**

మండలంలోని జామ్ గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం స్పిక్ మాకే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విరాసత్ వర్క్‌షాప్ డెమోన్స్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రముఖ కళాకారిణి ఆశా కుమారి విచ్చేసి, భారతీయ సంప్రదాయ కళారూపాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా కళల విశిష్టత, చరిత్ర, ప్రాముఖ్యతను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. తన ప్రత్యక్ష ప్రదర్శనలతో పాటు, కళలకు సంబంధించిన పలు మెళకువలను డెమోన్స్ట్రేషన్ రూపంలో చూపిస్తూ విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ విరాసత్ ప్రదర్శనకు వాలంటీర్ కార్తీక్ సమన్వయకర్తగా వ్యవహరించి పర్యవేక్షించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో భారతీయ సాంస్కృతిక వారసత్వంపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రాచీన కళల పట్ల ఆసక్తిని పెంచుతాయని చెప్పారు. విద్యార్థులకు మన సంస్కృతిని పరిచయం చేయడానికి స్పిక్ మాకే సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కళాకారిణిని ఘనంగా అభినందించారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

**- పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలి**

**- జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు పిలుపు**

**భైంసా, జులై 06, ప్రభాతవార్త:**



ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ టీఎస్ సంఘం నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు అన్నారు. సోమవారం మండలంలోని బోసి, బెల్తారోడా, బోరిగం, తానూర్, కోలూరు పాఠశాలల్లో 2026 నూతన సంఘ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సేవ, సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ టీఎస్ సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి సహకారంతో రాష్ట్ర సంఘం ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి అమలు చేయాల్సిన పీఆర్సీ, ఎనిమిదేళ్లు గడిచినా అమలు కాకపోవడంపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సాధించుకుంటామన్నారు. అలాగే ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా ఆఫ్లైన్ టెట్ నిర్వహించడంపై సంఘం ప్రత్యేక దృష్టి పెడుతుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు పరిచి, అన్ని రకాల పదోన్నతులు, బదిలీలు చేపట్టేలా సంఘం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను సంఘం ప్రాతినిధ్యం మేరకు ప్రభుత్వం నెలకు రూ.2 వేల కోట్లు విడుదల చేస్తోందని, దీనిని ఇలాగే కొనసాగించి వచ్చే మూడు నాలుగు నెలల్లో పెండింగ్ బిల్లులన్నీ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల హెల్త్ స్కీమ్‌ను వీలైనంత త్వరగా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహితంగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారంలో సంఘానికి మరింత బలం చేకూరాలంటే ప్రతి ఉపాధ్యాయుడు పీఆర్‌టీయూ టీఎస్ సంఘ సభ్యత్వం తీసుకొని, ఈ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు టి. పండరి, ప్రధాన కార్యదర్శి బుసి సుధాకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎన్. మల్లన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు సిహెచ్. వందన, మండల అసోసియేట్ అధ్యక్షుడు ఫాసిల్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రతకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ

**- 125వ జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**మంచిర్యాల, జూలై 6, ప్రభాతవార్త**



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, ఒకే దేశంలో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదనే లక్ష్యంతో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ కాశ్మీర్‌లో ప్రత్యేక హోదా రద్దు కోసం నిరంతరం పోరాటం చేశారని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి సాధన కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గం అశోక్, గాజుల ముఖేష్ గౌడ్, కమలాకర్ రావు, జోగుల శ్రీదేవి, కస్తూరి నాగరాజు, బోట్ల సత్యం, వైద్య శ్రీధర్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, ఆడే ప్రేమ్ సింగ్, పచ్చ స్వప్న రాణి, బింగి ప్రవీణ్, నాంపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతి వేదికపై మెరిసిన కొల్లూరు జానపద గాయకుడు విజయ్ కుమార్

**- రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవాల్లో తెలంగాణ ఉద్యమ గీతంతో అలరింత**

**- అధికారులు, ప్రముఖ గాయకుల చేతుల మీదుగా ఘనంగా సన్మానం**

**కోటపల్లి, జూలై 6, ప్రభాతవార్త**




తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక రవీంద్ర భారతి వేదికపై నిర్వహిస్తున్న 99 రోజుల సాంస్కృతిక ఉత్సవాల్లో మంచిర్యాల జిల్లా కళాకారుడు ప్రతిభ చాటారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం, కొల్లూరు గ్రామానికి చెందిన జానపద గాయకుడు నిమ్మల విజయ్ కుమార్ ఆదివారం (జూలై 5) నాటి వేడుకల్లో తన అద్భుత గాన ప్రతిభతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాట యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పేలా... ఖగపల్లె గడపలో ప్రజల గుండెలో మారుమోగిన పాట ఇది, జనాల అక్షర తోటగగ అంటూ ఆయన ఆలపించిన తెలంగాణ ఉద్యమ గీతానికి సదస్సులో సభికుల నుంచి భారీ స్పందన, ప్రశంసలు లభించాయి. కార్యక్రమం అనంతరం భాషా సాంస్కృతిక శాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పెద్దపల్లి విజయ్ కుమార్ గారి చేతుల మీదుగా యువ గాయకుడు నిమ్మల విజయ్ కుమార్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జానపద గాయకులు రేలారే ప్రసాద్, మాపల్లె శంకర్, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి వేదికపై కొల్లూరు గ్రామానికి చెందిన యువ కళాకారుడు తన ప్రతిభను చాటుకోవడం పట్ల మండల ప్రజలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.




## అక్రమ అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్వీ నాయకులు

**చెన్నూరు, జూలై 6, ప్రభాతవార్త**

చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి కేజీబీవీలో విద్యార్థుల అదృశ్య ఘటనలపై బాధితులను పరామర్శించి, వాస్తవాలను తెలుసుకునేందుకు వెళ్తున్న మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేయడం సరైంది కాదని బీఆర్ఎస్వీ నాయకులు మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి కేజీబీవీలో జరిగిన సంఘటన విదితమే. ఈ ఘటనపై బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించే క్రమంలో పోలీసులు వచ్చి మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేయడం శోచనీయమని మండిపడ్డారు. మాపై దౌర్జన్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ అన్నారు. విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయంలో, బాధితుల పక్షాన నిలబడి ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను బలవంతంగా ఈడ్చుకెళ్లడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, ప్రభుత్వం తన వైఫల్యాలను దాచిపెట్టేందుకు పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందన్నారు. గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే రాజీనామా చేయాలన్నారు. విద్యార్థుల ప్రాణాలకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం వెంటనే ఈ ఘటనలపై న్యాయపరమైన, సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## పైకాజీనగర్‌లో డ్రైనేజ్ సమస్యకు పరిష్కారం

**ఆసిఫాబాద్ టౌన్, జులై 6, ప్రభాతవార్త :**

పైకాజీ నగర్ పరిధిలోని ఆర్టీసీ డిపో వెనుక ఉన్న లైన్ నివాసితులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న డ్రైనేజ్ నీటి నిల్వ సమస్యకు రాజంపేట గ్రామపంచాయతీ శాశ్వత పరిష్కారం చూపింది. సోమవారం యుద్ధప్రాతిపదికన చేపట్టిన చర్యలతో నిల్వ ఉన్న మురికినీటిని పూర్తిగా తొలగించి ప్రజలకు ఉపశమనం కల్పించింది. గత కొంతకాలంగా కాలనీలో వచ్చే డ్రైనేజ్ నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక రోడ్డుపైనే నిల్వ ఉండేది. దీంతో రహదారి బురదమయంగా మారి ద్విచక్ర వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా నిల్వ ఉన్న మురికినీటి కారణంగా దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన రాజంపేట గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించారు. ముందుగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించిన అనంతరం గ్రామపంచాయతీ సిబ్బంది, యంత్రాల సహాయంతో డ్రైనేజ్‌లో ఉన్న అడ్డంకులను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. రోడ్డుపై నిల్వ ఉన్న మురికినీటిని పూర్తిగా తొలగించి, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇరువైపులా మట్టిని వేసి రహదారిని పునరుద్ధరించారు. పనులు పూర్తయిన అనంతరం రాజంపేట సర్పంచ్ బుర్స పోచయ్య, వార్డు సభ్యుల జిల్లా అధ్యక్షుడు గులాం జావిద్, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ కాలనీ వాసులతో కలిసి పనులను పరిశీలించి, నిర్వహించిన చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



పారిశుధ్యచర్యలు చేపడుతున్న రాజంపేట గ్రామపంచాయతీ సిబ్బంది



## అనధికార గోదాంలో ఎరువుల నిల్వ

- డీలర్‌కు షోకాజ్ నోటీసులు జారీ
- ఎఫ్‌సీఓ-1985 నిబంధనల ఉల్లంఘన
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

**వేమనపల్లి, జూలై 6, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల కేంద్రంలోని శ్రీ శివ కేశవ ఫర్టిలైజర్స్ యజమాని రవికి ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు నిబంధనల ఉల్లంఘనపై మండల వ్యవసాయ అధికారి సోదరి వీరన్న షోకాజ్ నోటీసు జారీ చేశారు. రైతులు జిల్లా కలెక్టర్, మండల వ్యవసాయ అధికారికి చేసిన ఫిర్యాదుల మేరకు సోమవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చినట్లు ఏవో తెలిపారు. తనిఖీల్లో ప్రస్తుత ఎరువుల లైసెన్స్‌లో నమోదు చేయని, గతంలో రద్దు చేసిన ఏఆర్ఎస్‌కే గోదాంలో ఎరువులను నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా, గోదాం మార్పునకు అవసరమైన లైసెన్స్ సవరణ (గోడౌన్ అమెండ్‌మెంట్) పొందకుండా, సంబంధిత అధికారుల అనుమతి లేకుండానే గోదాంను వినియోగిస్తున్నట్లు తేలినట్లు పేర్కొన్నారు. లైసెన్స్‌లో పొందుపరిచిన గోదాం కాకుండా వేరే ప్రదేశంలో ఎరువులను నిల్వ చేయడం, విక్రయించడం ఎఫ్‌సీఓ-1985 నిబంధనలకు విరుద్ధమని వెల్లడించారు. దీంతో డీలర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి, నోటీసు అందిన మూడు రోజుల్లోపు లిఖితపూర్వకంగా వివరణ సమర్పించాలని ఆదేశించారు. గడువులోగా వివరణ అందించకపోయినా లేదా సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేకపోయినా, ఎఫ్‌సీఓ-1985 నిబంధనల ప్రకారం లైసెన్స్‌పై చర్యలతో పాటు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి సోదరి వీరన్న నోటీసులో స్పష్టం చేశారు.

## రాహుల్ మృతిపై సమగ్ర దర్యాప్తుతోనే నిజాలు వెలుగులోకి రావాలి

- జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 06, ప్రభాతవార్త**



ఇంజినీరింగ్ విద్యార్థి అంకం రాహుల్ మృతి ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక, పారదర్శక దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ డిమాండ్ చేశారు. సోమవారం మీడియా సమావేశంలో చేరాల వంశీ మాట్లాడుతూ రాహుల్ మృతి కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదని, రాష్ట్రంలోని విద్యార్థుల భద్రత, విద్యాసంస్థల బాధ్యత, దర్యాప్తు వ్యవస్థపై సమాజం ఆలోచించాల్సిన పరిస్థితిని ఈ ఘటన కల్పించిందని, ఈ ల్ కేసులో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలకు వెళ్లకుండా అన్ని కోణాల్లో విచారణ చేపట్టి నిజానిజాలను వెలికితీయాలని, బాధ్యులెవరైనా చట్టం ముందు నిలబెట్టాలని ఆయన కోరారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన వివరాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్న ఆయన, ప్రతి విద్యార్థి భద్రతకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, విద్యార్థి కౌన్సెలింగ్ కేంద్రాలు, మానసిక ఆరోగ్య సహాయ వ్యవస్థల పనితీరుపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, విద్యార్థులకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అంకం రాహుల్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని తెలిపారు. ఈ కేసులో ఎలాంటి ఒత్తిళ్లు, ప్రభావాలకు తావు లేకుండా దర్యాప్తు జరగాలని, నిజాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రతను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని సూచించారు. ఈ ఘటనలో వాస్తవాలను వెలికితీయడానికి పారదర్శకమైన దర్యాప్తు అవసరమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాసంస్థల్లో బాధ్యతాయుతమైన పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్ మృతి ఘటనపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేలా దర్యాప్తు సంస్థలు పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని కోరారు.

# అర్హులైన మైనింగ్ సర్దార్లకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు కల్పించాలి

- ఎస్‌కె బాజీ సైదా - క్యాడర్ స్కీం ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నిరసన
- ఈ నెల 22 నుంచి మైనింగ్ సర్దార్ విధులు మాత్రమే నిర్వహిస్తామని హెచ్చరిక

**నస్పూర్, జూలై 6, ప్రభాతవార్త**



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణిలో క్యాడర్ స్కీం ప్రకారం అర్హులైన సీనియర్ మైనింగ్ సర్దార్లకు తక్షణమే ఓవర్‌మెన్ గ్రేడ్‌బి ప్రమోషన్లు కల్పించాలని, అప్పటివరకు వారి అసలు హోదాకు సంబంధించిన విధులను మాత్రమే అప్పగించాలని గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద సీనియర్ మైనింగ్ సర్దార్లతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏరియా అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాజీ సైదా మాట్లాడుతూ, 2016, 2017 బ్యాచ్‌లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్లకు క్యాడర్ స్కీం ప్రకారం మూడేళ్ల సర్వీస్ పూర్తి కాగానే ఓవర్‌మెన్ గ్రేడ్‌బి హోదాకు అర్హత లభిస్తుందని, అయినప్పటికీ యాజమాన్యం ఓవర్‌మెన్ ఖాళీలు లేవనే సాకుతో ప్రమోషన్లను మూడేళ్లుగా అనవసరంగా నిలిపివేస్తోందని మండిపడ్డారు. మరోవైపు యాజమాన్యం ఓవర్‌మెన్ ప్రమోషన్ ఇవ్వకుండానే సదరు మైనింగ్ సర్దార్లతో నిరంతరం ఓవర్‌మెన్ విధులు నిర్వహింపజేస్తోందని బాజీ సైదా ఆరోపించారు. దీనివల్ల సంస్థలో ఓవర్‌మెన్‌ల అవసరం, ఖాళీలు పైకి కనబడకుండా పోతున్నాయన్నారు. పోస్టులను కృత్రిమంగా తగ్గినట్లు చూపిస్తూ అర్హులైన ఉద్యోగుల హక్కులను కాలరాయడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే స్పందించి ప్రమోషన్లు కల్పించాలని, అప్పటివరకు సీనియర్ మైనింగ్ సర్దార్లకు ఓవర్‌మెన్ విధులు అప్పగించరాదని స్పష్టం చేశారు. ఒకవేళ ఖాళీలను భర్తీ చేయకపోతే ఈ నెల 22వ తేదీ మొదటి షిఫ్ట్ నుండి సీనియర్ మైనింగ్ సర్దార్లు కంపెనీ ఇచ్చిన ఆఫీస్ ఆర్డర్ ప్రకారం కేవలం మైనింగ్ సర్దార్ డ్యూటీ మాత్రమే నిర్వహిస్తారని, ఓవర్‌మెన్ విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వరరావు, బ్రాంచ్ మైనింగ్ స్టాఫ్ అధ్యక్షుడు అడ్డు శ్రీనివాస్, నాయకులు గొర్రె నరసయ్య, శెట్టి శంకరయ్య, క్రాంతి, అచల్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూలై 6, ప్రభాతవార్త**

కుక్కలు, పిల్లలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మంచిర్యాల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమానికి జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డా. యాకూబ్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల యజమానులు తప్పనిసరిగా కుక్కలు, పిల్లలకు రేబిస్ టీకాలు వేయించాలని తెలిపారు. మనుషుల నుండి జంతువులకు, జంతువుల నుండి మనుషులకు జూనోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, రైతులు, పశుపోషకులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న జంతువులను వేరుగా ఉంచడం, పాలు, మాంసాన్ని పరిశుభ్రంగా నిర్వహించడం, చనిపోయిన జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే పశు వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రేబిస్ వ్యాధి 100 శాతం నివారించ దగినదని, కుక్కలు, పిల్లలకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా కుటుంబాలు, సమాజాన్ని సురక్షితంగా ఉంచవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జంతువులు ఆరోగ్యకరమైన మనుషులు ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంతో అందరం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డా. శాంతి రేఖ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సోనియా, సహాయకులు గోవర్ధన్, గోపాలమిత్ర వేణు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





శ్రీరాంపూర్‌లో జరుగుతున్న అధికారుల రిలే నిరాహార దీక్షా శిబిరం

## అధికారుల దీక్షకు బీజేపీ, సేఫ్టీ జీఎం మద్దతు

- శ్రీరాంపూర్‌లో 8వ రోజుకు చేరిన సీఎంఓఏఐ రిలే నిరాహార దీక్షలు

**నస్పూర్, జూలై 6, ప్రభాతవార్త**

సింగరేణి అధికారుల పే అప్‌గ్రేడేషన్, నిలిపివేసిన పీఆర్‌పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) చెల్లింపుల డిమాండ్లతో సీఎంఓఏఐ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని బీజేపీ సీనియర్ నాయకులు వెరబెల్లి రఘునాథ్ రావు ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ శ్రేణులు సందర్శించి తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియా పర్యటనలో భాగంగా వచ్చిన కార్పొరేట్ జనరల్ మేనేజర్ (సేఫ్టీ) సాయిబాబా, సింగరేణి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సైతం అధికారుల దీక్షకు మద్దతు తెలిపారు. సోమవారం జరిగిన దీక్షల్లో డిప్యూటీ మేనేజర్లు కిరణ్ కుమార్, జగదీష్, అండర్ మేనేజర్లు శశి కుమార్, రవి తేజ, ఏఈ హరీష్ తదితరులు కూర్చున్నారు. సాయంత్రం వేళకు సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు లక్కాకుల మహేష్, జనరల్ సెక్రెటరీ మల్లయ్యల ఆధ్వర్యంలో అధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ చెల్లింపులపై యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసనలు కొనసాగుతాయన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు జరిగే ఈ దీక్షలలో అధికారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, జూలై 6, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామపంచాయతీ చందనాపూర్ గ్రామవాసులు తమ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో 136 రేషన్ కార్డులు ఉన్నాయని, స్థానికంగా రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన కడియాల పద్మ తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొనుటలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆలస్యం జరిగిందని, ఇప్పుడు ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం గంగారం గ్రామానికి చెందిన పాగిడి శోభ తాను ఏఎన్ఎం, ఇంటర్, ఎంపిహెచ్‌డబ్ల్యు అర్హత కలిగి ఉన్నానని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన కొలిపాక శ్రీనివాస్ తాము నివసిస్తున్న ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్ ప్రాంతానికి చెందిన బాసపోయిన రవీంద్ర కుమార్ తాను మంచిర్యాల జిల్లాలోని గరిమెళ్ళ గ్రామంలో కొనుగోలు చేసిన భూమికి మ్యుటేషన్ ద్వారా పట్టా జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన రాచర్ల సంతోష్ తన తండ్రి పేరిట గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణించారని, ఇదే అదనుగా కొందరు భూమిని అక్రమంగా ఆక్రమించి పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ లైబ్రరీ సైన్స్ విద్యార్థులనిరుద్యోగుల సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, శాఖా గ్రంధాలయాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో లైబ్రరీ అండ్ పోస్టులను ప్రత్యక్ష పద్ధతిన డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 79 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నితికా పంత్

## ప్రజలు నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలి

**ఆసిఫాబాద్, జులై 6, ప్రభాతవార్త :**

ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజ ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.



పంచాయతీ కార్యదర్శికి సన్మాన దృశ్యం

## నూతన కార్యదర్శికి ఆత్మీయ స్వాగతం.. మాజీ కార్యదర్శికి ఘన వీడ్కోలు

**వేమనపల్లి, జూలై 6, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామ పంచాయతీలో నూతనంగా నియమితులైన పంచాయతీ కార్యదర్శి టి. చైతన్య కుమారికి గ్రామ సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం బదిలీపై వెళ్లిన మాజీ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామాభివృద్ధిలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొర్కుటి నరేష్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని నూతన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలియజేయగా, మాజీ కార్యదర్శి సురేష్‌కు భవిష్యత్ జీవితంలో విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు.

## క్రికెట్ లీగ్ పోటీలకు రిత్విక్ ఎంపిక

**బెల్లంపల్లి, జూలై 06, ప్రభాతవార్త**



ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహించిన సిడివిజన్ క్రికెట్ లీగ్ పోటీలలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన రెడ్డి రిత్విక్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ అండర్14 విభాగ పోటీలలో రిత్విక్ ప్రతిభ కనబరిచి సెలక్షన్ పొందడం విశేషం. తన ప్రతిభతో ఎంపిక కావడం పట్ల క్రీడాభిమానులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## బెల్లంపల్లి కన్నాల శివారులో జర్నలిస్టుల స్థలాల కబ్జాపై చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి, జూలై 06, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల శివారులో జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలను అక్రమంగా కబ్జా చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. సంబంధిత అధికారులు చూస్తూ ఉండటం ఆశ్చర్యకరమని, అధికార బలం, అంగ బలంతో ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం బెల్లంపల్లి నియోజకవర్గంలో సాధారణంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం మరియు ప్రజల మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టుల స్థలాలను కబ్జా చేయడం అనేది అన్యాయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎమ్మార్వోలు వెంటనే స్పందించి జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలు వారికి తిరిగి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జర్నలిస్టులు చేపట్టే ప్రతి ఉద్యమానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని, వారికి స్థలాలు దక్కే వరకు పోరాటంలో భాగస్వామ్యం అవుతామని వెంకటేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అ చల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దుర్గం లక్ష్మి, సబ్బని రాజశేఖర్, జాడి రాజకుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**తాండూర్, జూలై 6, ప్రభాతవార్త :**

ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చ మోహన్ డిమాండ్ చేశారు. తాండూర్ జెడ్పి ఎస్ఎస్ లో సోమవారం నిర్వహించిన పిఆర్టియు సభ్యత్వ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, మానిఫెస్టో లో రూపొందించిన విధంగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా హెల్త్ కార్డుల సేవలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రావలసిన పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషన్ నివేదికను వెంటనే తెప్పించుకుని, కనీసం 50 శాతం ఫిట్‌మెంట్‌తో కొత్త పీఆర్సీని ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ నెలకు రూ.2000 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టి మండల అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సర్ ప్రక్రియ

**ఆసిఫాబాద్, జులై 6, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మండలంలో సర్ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. మండలంలో 43,738 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు బీఎల్ఎలు ఫారాలను సంబందిత ఓటర్లకు అందజేశారు. సోమవారం వరకు 12,006 మంది ఓటర్లు తమ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేశారు. బీఎల్ఎలు సంబందిత ఫారాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయగా వచ్చిన పాఠాలను డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రియాజ్ అలీ మాట్లాడుతూ ఓటర్లు తమ సర్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి బీఎల్ఓలకు అందజేయలన్నారు. సర్ ప్రక్రియకు ప్రజలు సహకరించలన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 24 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డిటి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మార్వో రియాజ్ అలీ



## కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ

**- రూ.34 లక్షల ఈజీఎస్ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం**

**- గిరిజన బిడ్డల చదువు, భద్రతకు ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**జైనూర్, జులై 06, ప్రభాతవార్త:**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని భూషిమెట్ట గిరిజన గురుకుల కళాశాలలో ఈజీఎస్ (ఉపాధి హామీ పథకం) ద్వారా మంజూరైన రూ.34 లక్షల నిధులతో చేపట్టనున్న ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులకు సోమవారం ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి భూమిపూజ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథరావు, సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, స్థానిక సర్పంచులతో కలిసి ఆమె ఈ పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. గిరిజన బిడ్డల చదువుతో పాటు వారి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. కళాశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించడం వల్ల బయటి వ్యక్తుల ప్రవేశాన్ని అడ్డుకోవచ్చని, తద్వారా విద్యార్థులకు పూర్తిస్థాయి రక్షణ లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథరావు, జైనూర్ సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, స్థానిక సర్పంచ్ ఆత్రం సింధు నగేష్, జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, ఉట్నూర్ ఐటీడీఏ ఏఈ ఇంధల్ సింగ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జశోద, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మొలకెత్తని సోయాబీన్: నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు రైతుల వినతి

**- తేజస్విని విత్తన రకంతో నిలువునా మునిగిన బజార్‌హత్నూర్ రైతాంగం**

**బజార్‌హత్నూర్, జులై 06, ప్రభాతవార్త:**

మండలంలో తాము సాగు చేసిన 'తేజస్విని' రకం సోయాబీన్ విత్తనాలు మొలకెత్తకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని, సంబంధిత విత్తన కంపెనీతో మాట్లాడి తగిన నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ బజార్‌హత్నూర్ మండల రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను కలెక్టర్‌కు వివరిస్తూ.. భారీ ఆశలతో తేజస్విని సోయాబీన్ విత్తనాలను కొనుగోలు చేసి విత్తామని, అయితే నాణ్యతా లోపం వల్ల అవి ఎంతకూ మొలకెత్తలేదని తెలిపారు. దీనిపై విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణంలో వివరణ కోరగా, ప్రత్యామ్నాయంగా ఇప్పుడు 'ఓంకార్' అనే మరో సోయాబీన్ రకం ఇస్తున్నారని పేర్కొన్నారు. అయితే, మార్కెట్లో తేజస్విని రకం ధర రూ.3,800 ఉండగా, ఓంకార్ రకం ధర రూ.3,100 మాత్రమే ఉందని, కేవలం విత్తనాల ధరలోనే తాము ఎకరానికి రూ.700 నష్టపోవాల్సి వస్తోందని వివరించారు. దీనికి తోడు ఇప్పటికే చేసిన ట్రాక్టర్ దుక్కుల ఖర్చులు, వేసిన ఎరువుల పెట్టుబడి కూడా పూర్తిగా బూడిదలో పోసిన పన్నీరైందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తప్పు చేసిన విత్తన కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు జరిగిన పెట్టుబడి నష్టాన్ని పూర్తిగా రికవరీ చేసి ఇప్పించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతులు చంద్రశేఖర్, ప్రభాకర్, గంగయ్య, భోజన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేస్తున్న బజార్‌హత్నూర్ మండల రైతులు

# రైతుబంధు పాత బకాయిలను పూర్తిగా చెల్లించాలి

**- మూడు విడతల్లో ప్రభుత్వం సుమారు రూ.21 వేల కోట్లు రైతులకు బాకీ**

**- బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా నాయకుడు మజర్ డిమాండ్**

**బజార్‌హత్నూర్, జులై 06, ప్రభాతవార్త:**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులకు ఇవ్వాల్సిన రైతు పెట్టుబడి సాయం (రైతుబంధు/రైతు భరోసా) బకాయిలను వెంటనే పూర్తిగా చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా నాయకులు మజర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెట్టుబడి సహాయం సకాలంలో అందకపోవడంతో అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విడతల వారీగా అందించే నిధులను ప్రభుత్వం కొందరికి వేసి, మరికొందరికి వేయకుండా నిరక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. గత విడతలో నెలకొక ఇన్‌స్టాల్‌మెంట్ చొప్పున ఏకంగా రెండు ఎకరాలకే రైతుభరోసాను పరిమితం చేసి రైతులను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఎకరాల వారీగా ఎంత మొత్తం బకాయి ఉందో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని ఎలాంటి జాప్యం లేకుండా రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం రైతులకు అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిందని మజర్ ఆరోపించారు. 2026 వానకాలం రైతులకు విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 1,18,92,952.11 ఎకరాలకు గాను మూడు విడతల్లో ప్రభుత్వం రైతులకు దాదాపు రూ.21 వేల కోట్లు బాకీ పడిందని, వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇకనైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతుల సంక్షేమమే ప్రథమ బాధ్యతగా గుర్తుంచుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### తలసేమియా, సికిల్‌సెల్ బాధితులకు

# తొలి ప్రాధాన్యంగా పెన్షన్లు ఇవ్వాలి

**- హిమోఫీలియా బాధితులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి**

**- ఆంధ్రప్రదేశ్ తరహాలో నెలకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించాలని తలసేమియా సంక్షేమ సంఘం విజ్ఞప్తి**

**మంచిర్యాల, జూలై 6, ప్రభాతవార్త**

తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా వంటి తీవ్రమైన రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని ప్రత్యేక వర్గంగా పరిగణించి, వికలాంగుల కొత్త పెన్షన్లను తొలి ప్రాధాన్యంతో మంజూరు చేయాలని, అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని తలసేమియా సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గుర్తించిన 21 రకాల వైకల్యాల పరిధిలో ఈ వ్యాధులు కూడా ఉన్నందున, బాధితులకు ఎలాంటి జాప్యం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. కొత్తగా రెండు లక్షల మంది వికలాంగులకు పెన్షన్లు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి నెల రోజులు గడిచినా, ఇప్పటివరకు అమలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడం నిరాశ కలిగిస్తోందని పేర్కొన్నారు. పక్క రాష్ట్రంలో తలసేమియా, మూత్రపిండాల చికిత్స పొందుతున్నవారు, క్యాన్సర్ బాధితులు తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తున్న నేపథ్యంలో, తెలంగాణలోనూ తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా బాధితులకు అదే తరహాలో నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాధులతో బాధపడుతున్నవారు జీవితాంతం మందులు వాడాల్సి రావడంతో పాటు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని, దీనివల్ల ఒక్కో కుటుంబానికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వైద్య ఖర్చులు అవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలు ఈ భారాన్ని భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తం ఎక్కించుకోవడం, వైద్య పరీక్షలు చేయించుకోవడం కోసం బాధితులు తరచూ జిల్లా కేంద్రాలు, రాజధానికి వెళ్లాల్సి వస్తోందని, ప్రయాణ ఖర్చులు కూడా వారికి అదనపు భారంగా మారుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 21 రకాల వైకల్యాలున్న వారందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనివల్ల బాధితులు సకాలంలో వైద్యం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా బాధితులను ప్రత్యేక వర్గంగా గుర్తించి, తొలి ప్రాధాన్యంతో వికలాంగుల పెన్షన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో బాధితుల తల్లిదండ్రులు ఇసంపెల్లి సత్యనారాయణ, మడావి ధర్మేందర్, ఈశ్వరోజ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని సంఘం డిమాండ్లకు మద్దతు ప్రకటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తల సేమియా సంఘం నాయకులు

## దేసి శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లు రైతులకు మెరుగైన సేవలు అందించాలి

**ఆసిఫాబాద్, జులై 6, ప్రభాతవార్త :**




రైతులకు నాణ్యమైన వ్యవసాయ సలహాలు, సాంకేతిక సూచనలు అందిస్తూ వ్యవసాయ శాఖకు, రైతులకు మధ్య వారధిగా పనిచేయాలని డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి బోర్‌కుట్ వెంకట్ సూచించారు. శనివారం జనకాపూర్ రైతు వేదికలో దేసి కోర్సు పూర్తి చేసిన ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ దేసీ శిక్షణ పొందిన డీలర్లు రైతులకు సరైన సలహాలు, సూచనలు అందించడంతో పాటు వ్యవసాయ శాఖ ద్వారా అందించే తాజా సమాచారం, ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేసి వారు లబ్ధి పొందేలా కృషి చేయాలని సూచించారు. ఇన్‌పుట్ డీలర్లు పారా అగ్రికల్చర్ వాలంటీర్లుగా రైతులకు సేవలు అందిస్తూ వ్యవసాయ శాఖకు, రైతులకు మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరించాలని తెలిపారు. దేసీ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, రోజువారీ రికార్డుల నిర్వహణలో నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన డీలర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేసీ కోఆర్డినేటర్, సహాయ వ్యవసాయ సంచాలకులు జాడి మిలింద్ కుమార్, దేసీ ఫెసిలిటేటర్ చునార్కర్ సావన్, దేసీ సభ్యులు, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.